

# గుణపాఠం

కొండముది శ్రీరామచంద్రమూర్తి

శివానందకు, కన్నమదాసు మీద వల్ల మాలిన కోపం వచ్చింది. కడజాతివాడు, తన కనుసన్నల్లో మెలగవలసిన వాడు, చెప్పు కింద తేలులాగా వుండవలసిన వాడు- పచ్చికలో పాములాగా కనిపించీ కనిపించకుండా, పక్కలో బల్లెమై తనను భయపెడుతున్నాడు. వంశానుగతంగా వస్తున్న తన పెత్తందారీ తనానికి, తన అధికారానికి వాడో అడ్డుపుల్ల అనుకున్నాడు శివానందం. ఆ మాటే పెద్దగా కరణం శ్రీరాములు పంతులుతో అన్నాడు-మీసం సవరించుకుంటూ. శివానంద కళ్ళు ఎర్రగా వున్నాయి, గొంతు జీరగా వుంది, మాట

ముద్దగా వుంది, నోరు వాసనగా వుంది.

శ్రీరాములు పంతులు కళ్ళు చికిలించి, ఆలోచిస్తూ అన్నాడు- "రౌడీ రంగడికి కబురంపనా?"

శివానంద కళ్ళు పెద్దవైనాయి- "అంటే శాస్త్రీనే గల్లంతు చేద్దామంటావా?"

"అదే మంచిదేమో! వందల ఎకరాల పల్లం పొలం అనుభవిస్తున్నా, చట్టం ఏదీ దేముడి దయవల్ల మీ దగ్గరకు రాలేదు. కన్నమదాసు లాంటి వాళ్ళు నలుగురు కలిస్తే, ల్యాండ్ సీలింగ్ కాదు, వెల్త్ టాక్స్, ఇన్ కమ్ టాక్స్, ఆ టాక్సు, ఈ టాక్సు అన్నీ మిమ్మల్నే చుట్టు ముట్తాయి. ఆ తర్వాత మీ ఇష్టం!"

రకరకాల డిపార్ట్ మెంట్ల మనుష్యులొచ్చి తన లంకంత కొంపా సోదా చేస్తున్నట్లు, తరతరాలుగా తన ఇంట్లో దాచిన వెండి, బంగారాలను వెలికి తీసి స్వాధీనం చేసుకొంటున్నట్లు, వాళ్ళకు కన్నమదాసు ఇన్‌ఫార్మర్‌గా వుండి లీడ్ చేస్తున్నట్లు,కన్నమదాసు గూడెంలో మనుష్యులకు సామ్యవాద సిద్ధాంతాలు చెప్పి వాళ్ళందర్నీ తన పొలాల్లో కూలి పనులకు రాకుండా చేసినట్లు, తన కుప్పలన్నీ దోచుకున్నట్లు, తన పరువు- ప్రతిష్టలు గంగలో కలిసి, తన సిరి సంపదలు హరిస్తున్నట్లు- రకరకాల భ్రాంతులకు శివానంద లోనయ్యాడు. ఆ భ్రాంతిలో నుండి బయట పడకుండానే రౌడీ రంగడికి కబురు చేశాడు.

రంగడు రావడం రావడమే కాలనాగులా వచ్చాడు. మండుతున్న అగ్ని గోళంలా వచ్చాడు. నాటు సారా వాసనలా వచ్చాడు. "ఏం దొరా! ఏం సేమన్నావ్?" అన్నాడు కర్కశంగా.

దొర, గ్రామ కరణం వేపు చూశాడు. గ్రామకరణం శ్రీరాములు పంతులు, రంగడి వేపు అర్థవంతంగా చూస్తూ- "ఇంట్లోకి పద" అన్నాడు.

మండువా లోగిలి ఇంట్లో, మారు మూలగదిలో చీకటిగా వున్న చోట ముగ్గురూ గుసగుసలాడుకున్నారు. ఇనప్పెట్టె తలుపు తెరవ బడింది. రంగడి జేబు బరువెక్కింది.

రంగడు రోడ్డు మీద కొచ్చి చేబ్రోలు చుట్ట పొగాకు ముక్క ముట్టించుకున్నాడు. నర్సింలు సారా కొట్టుకు వెళ్ళి నాలుగు మెంతలు పూటుగా తాగాడు. మెరక వీధిలో రంగసాని దగ్గర ఓ గంట కాల

క్షేపం చేశాడు. రాత్రి ప్రొద్దు పోయిం తర్వాత, తెల్లని చంద్రుడు మబ్బు నీడల్లో నల్లబడ్డ తర్వాత రామాలయం దాటి-చెరువు దాటి సన్నగా ఈల వేసుకుంటూ గూడెం వేపుగా బయల్దేరాడు.

శివాలయం ధ్వజ స్తంభం దగ్గర, శ్రీరాములుపంతులు అతగాణ్ని అటకాయించాడు.

"హుష్, ఇటురా!" అంటూ సంజ్ఞ చేశాడు.

రంగడు, పంతుల్ననుసరించి ధ్వజ స్తంభం క్రీనీడలోకి వచ్చాడు. దూరంగా పడుకున్న ఫూరకుక్క—వొకటి వాళ్ళ వేపు నిక్కి నిక్కి చూస్తున్నది.

"వెర్రెధవా! పచ్చ కాయితం కళ్ళబడే సరికి, మెదడు మొద్దు బారి పోతుందేవిట్రా? కన్నమదాసు నీకేం అన్యాయం చేశాడూ? పైగా, మీదీ మీదీ ఒకటే కులం కదా?"

కన్నమదాసు మీద ఏ రకమైన స్పర్థాలేని రంగడు బుర్ర గోక్కున్నాడు. వాడి కళ్ళ ముందు పచ్చ కాయితం పదింతలుగా పెరిగి కనిపించింది. "డబ్బును మించిందేటి వుంది పంతులూ ఈ లోకంలో?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"ఓరి వెర్రి వెధవా! ఆ సంగతి నాకూ తెలుసురా! డబ్బే అన్నింటి కన్నా ముఖ్యం-నిజమే! కానీ ఆ డబ్బును సంపాయించడంలో కూడా ఉచ్చనీచాలుండాలి కదా?"

"అంటే, ఏటి పంతులూ?"

"అంటేనా?" కరణం, భుజాల మీది ఉత్తరీయాన్ని సరి చేసుకున్నాడు. గీతా బోధన చేస్తున్న శ్రీకృష్ణునిలా, జగద్రహస్య సిద్ధాంతాన్ని బోధిస్తున్న వేదాంతిలా, గంభీరంగా నవ్వుతూ అన్నాడు- "డబ్బే ఈ లోకంలో అన్నిటికీ ముఖ్యం- కాదనను. కానీ బీద వాడి దగ్గరున్న డబ్బు చెమటతో, వాడి రక్తంతో పవిత్రమైంది. ధనవంతుడి దగ్గరున్న డబ్బు స్వార్థంతో, మోసంతో, దోపిడితో అపవిత్రమైంది. డబ్బును పలు విధాల సంపాయించ వలసిందే-కాదనను. కానీ అక్క చెల్లెళ్ళను మోసం చేసీ, అయిన వాళ్ళను దారులు కొట్టీ, స్నేహితులను దగా చేసీ, నమ్మిన వాళ్ళను నట్టేట ముంచీ ఆ డబ్బును సంపాయించకూడదు. మరి డబ్బును సంపాయించడం ఎట్లా అని నీ సందేహం కదూ? చెబుతాను విను- డబ్బు గల వాళ్ళు మోసగాళ్ళని చెప్పాను కదా! ఆ వున్న వాళ్ళలోనూ శివానంద లాంటి వాళ్ళు పరాన్న భుక్కులు, రాబందులు, పగటి వేష

గాళ్ళు. వాళ్ళ కుంభస్థలం కొట్టు. అదీ పబ్లిగ్గా కాదు, చాటుగా చూసి చావు దెబ్బ కొట్టు. దెబ్బ కొట్ట లేక పోతే కనీసం ఏడిపించు. ఆ కన్నీళ్ళు చూసి సంతోషించు."

విశ్వరూప సందర్శనం చూసిన అర్జునునిలా, రంగడు ముకుళిత హస్తుడైనాడు- "వృత్తిగా కన్నీరు కార్పిస్తే మనకేటి నాబం కరణం బాబూ?"

"ఒరేయ్ రంగడూ! లాభం లేని వ్యవహారాన్ని దేన్నీ కరణం చెప్పడు. సరేనా?"

ఆ తర్వాత ఇద్దరూ నీడల చాటున మరింత దగ్గరకు వచ్చారు. చీకటి మాటున చెవులు కొరుక్కున్నారు. అంగీకారంగా తలలూపుకున్నారు. రంగడు ఉషారుగా ఈల వేయబోయి తమాయించుకుని- "మీ అగిడియా బెమ్మాండంగా వుంది బాబూ! పాము సత్తుంది- కర్ర ఇరగదు" అంటూ వెనక్కు తిరిగి ఊరికి విసిరి వేసినట్లు వున్న హరిజనవాడ వేపు సాగి పోయాడు.

* * *

తొలి కోడి కూసీ కూయకుండానే శివానంద ఇంటి ముందు నిలబడి, "బాబుగోరు- బాబుగోరూ!" అంటూ వణకుతున్న కంఠంతో రంగడు కేక వేశాడు. వాడి కళ్ళు ఎదురుగా అటూ యిటూ చూస్తున్నాయి. వాడి చొక్కా మీద రక్తం. గాలికి రేగిన వాడి పల్చటి వెంట్రుకలు మీద రక్తపు చుక్కలు. వాడి గొంతుకు విని దివాణంలో దూరంగా పహారా తిరుగుతున్న ఆల్సేషియన్ ఠీవిగా నిలబడి, అతని వేపు ప్రశ్నార్థకంగా చూసింది. తలుపులు తెర్చుకుని, కళ్ళు నలుపుకుంటూ బయటకు వచ్చిన శివానంద రంగడి వాలకం చూసి కంగారు పడిపోయాడు. "ఏవి ట్రా? ఏమైంది?" అన్నాడు తబ్బిబ్బుగా. అప్పటికే అతని మొహాన చెమట పడుతున్నది.

"సంపేశాను దొరా, నా కొడుకును! ఒక్క పోటుకు సచ్చాడు నాయాలు! ఇంక మీకు ఆడి పీడ నేదు. కాని దొరా! ఆ బక్కసిక్కి నోడిలో ఎంత రగతం వుందని!! ఇట్టా పొడిసానా-అట్టా పైకి వూటగా చిమ్మింది దొరా రగతం! నా ఒంటిమీదికి బుస్సున కొట్టింది. సర్లే! కొడితే కొట్టింది కాని దొరా, ఇది కడుక్కుంటే పోద్ది. ఆడి సవాన్నేం సేయమంటాడు? అదే నాకు తెలీనేదు. తెలీక ఆణ్నో ఒంటెద్దు బండిలో పడేసి, మీదింతి గడ్డికుక్కి, ఇట్టా లాక్కొచ్చినా!"

రంగడి మాటలు వినగానే శివా

నందకు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది. ఆ తెలివి తక్కువ వెధవ, స్వామి భక్తిలో నిట్టనిలువున తనను గోతిలో దింపినట్లనిపించింది. పోలీసులు....అరదండాలు....న్యాయస్థానం... విచారణ....నల్ల గౌన్ల ప్లీడర్లు....చివరగా తనకు శిక్ష....నలుగురూ తనను హంతకుడంటూ వేలు పెట్టి చూపిస్తూ మొహాలు పక్కకి తిప్పుకోవడం....తన కుటుంబానికి అవమానం....రకరకాల దృశ్యాలు అతని కళ్ళ ముందు. భవిష్యత్ అంధకారమయమై, కంటకావృతమై, తనను అధఃపాతాళానికి అణగ ద్రొక్కుతున్నట్లనిపించింది.

తను చేసిన ఒక్క తప్పు, కరణం మాట విని, తను తొందరపడి రంగడికి ఇచ్చిన ఒక్క సూచన....శివానంద గుండె బలహీనంగా కొట్టుకుంది. కంఠం బేలగా పలికింది.

"ఎక్కడికి తీసుకొచ్చావురా ఆ శవాన్ని?"

"ఈడకే బాబూ, మీ గుమ్మం కాడికి."

శివానంద తడబడుతున్న అడుగులతో గుమ్మం దగ్గరకు వచ్చాడు. బయటకు తొంగిచూశాడు. ఆకాశం మీద అనంతంగా వెలుగుతున్న నక్షత్రాలు. చెరువు మీదనుంచి ప్రశాంతంగా వీస్తున్న చల్లని గాలి. దూరంగా ఎవరో వో తల్లి పసిబిడ్డకు లాలిపాడుతున్నది. శివానంద అడుగులో అడుగు వేసుకుంటూ బండి దగ్గరకు వచ్చాడు. ద్విగుణీకృత భయంతో బండిలోకి తొంగి చూశాడు.

లోపల గడ్డిమధ్య కప్పబడిన కన్నమదాసు, నల్లబడుతున్న రక్తం మధ్య ఎర్రగా, నల్లగా శపిస్తున్నట్లుగా కనిపించాడు. అతని కళ్ళు మూసుకుని వున్నా మండుతున్న అగ్ని గోళాల్లాగానే కనిపించాయి. నిశ్చలంగా వున్న అతని పెదిమలు ఏదో పలుకుతున్నట్లే వున్నాయి.

శివానంద కళవళ పడిపోతూ- "వొద్దు- వొద్దు. ఈ శవాన్నిక్కడుంచొద్దు. తీసుకుపో. వెంటనే, ఇప్పుడే, ఎక్కడికైనా సరే, ఊఁ!" అన్నాడు స్పష్టాస్పష్టంగా.

'నాకేమిపని!' అన్నట్లుగా రంగడు అగ్గిపుల్ల గీసుకున్నాడు. వెలిగించి, పీల్చి, ఆర్పిన చుట్టను, చెవి సందునించి తీసి మళ్ళీ ముట్టించుకున్నాడు. గట్టిగా ఒక దమ్ము లాగి- "అణ్ణి సంపడానికి మీరిచ్చింది రెండు గుక్కల సారాకే సరిపోనేదు. ఇంక ఈ పని గూడా

నేనెక్కడ సెయ్యను? ఆ శవాన్ని ఏం సేసుకున్నా మీ ఇట్టం. నే పోతున్నా" అంటూ వెనక్కి తిరిగి నాలుగడుగులు వేశాడు.

"రంగడూ! వుండుండు, వెళ్ళొద్దు - వెళ్ళొద్దు. నీకు ఎంత కావలసినా ఇస్తాను. ప్లీజ్!" అంటూ శివానందం లోపల్నుండి నోట్ల బొత్తులు పట్టుకొచ్చాడు. రంగడు తలకు చుట్టుకున్న కండువాలో వాటిని మూట కట్టుకున్నాడు.

"ఇప్పుడు సెప్పండి - ఈ సెవాన్ని ఏం సేయమంటారు?"

"నువ్వేం చేసినా సరే! ఈ చుట్టు ప్రక్కల మాత్రం వాణ్ణి గురించి ఏ ఎంక్వయిరీ రేపు జరిగినా, నేను థర్డ్ పర్సన్‌గానే వుండాలి."

"అట్టాగే లెండి. మీ రిట్టమొచ్చినట్టే ఉండండి."

రంగడు బండి లాక్కుంటూ చీకట్లో కలిసిపోయాడు. బండి కనుచూపు దాటిపోయిం తర్వాత శివానంద గుండె కొంత స్వస్థతపడింది. 'అమ్మయ్య! తను అనుకున్నది నెరవేరింది. తన పెత్తందారీతనానికి అడ్డుపుల్ల తొలిగిపోయింది. పచ్చికలో పాము తల ఎత్తకుండానే పడగ వాల్చేసింది.' భారంగా తృప్తిగా నిట్టూర్చి శివానంద దివాణం లోపలకు వెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

* * *

ఆ మర్నాడు రోజూ ఉదయించిన రీతిలోనే సూర్యుడు ఉదయించాడు. పక్షుల కలకూజితాల్లో మార్పు లేదు. పువ్వులు మామూలుగానే వికసించాయి. ఆ వూరి జనం ఎవరి జీవన తాపత్రయంలో వాళ్ళు యంత్రాల్లా పనిచేసుకుంటున్నారు.

"ఏమున్నాయ్ సంగతులు ?" అన్నాడు శివానంద ఆ రోజు తనను కలవవచ్చిన వారి నందరినీ.

"ఏమున్నాయండీ? మామూలే!" అన్నారు వాళ్ళు, నీళ్ళు నములుతూ.

ఆ రోజు సాయంకాలం షికారుగా బయటకు వచ్చి, చెరువు దాటి, పొన్నుకర్ర వూపుకుంటూ వేణుగోపాలస్వామి దేవాలయం దాటి, లంకపుగాకు చుట్ట ముట్టించుకుని హరిజనవాడకు దగ్గరగా వచ్చిన శివానంద, ఆ మూల వంతెన మీద కన్నమదాసును చూసి అవాక్కయిపోయాడు.

కన్నమదాసుకు అటూ యిటూ కరణం శ్రీరాములూ, రంగడూ వున్నారు విచ్చుకత్తుల్లా నిలబడి.

"రంగడూ!" అనబోయాడు శివానంద. నోట్లో మాట నోట్లోనే

వుండిపోయింది.

"కరణం-నా మీదనే నియోగం చూపించావే!" అనబోయాడు. అన బోయిన మాట ఆయనకే వినిపించ లేదు.

కన్నమదాసు గంభీరంగా నడుస్తూ శివానంద దగ్గరకు వచ్చాడు. నమస్కారం చేశాడు. "రాత్రి ఆ బండిలో వున్నది నేనే!" అన్నాడు ప్రశాంతంగా. "నేను చచ్చిపోతే మీ అధికారాన్ని మరొకరు అడ్డుకుంటారు. అందు కోసమని మానవత్వాన్నే కోల్పోతే ఎట్లా?" అన్నాడు గంభీరంగా.

"డబ్బిత్తే మానాంటి సలి సీమలు అడ్డమైన పనీ సేపి, ఇనప కటకటాల ఎనక ఇరుక్కుంటా యనుకోకండి దొరా!" అన్నాడు రంగడు పెద్దగా నవ్వుతూ.

"కరణాలూ, కడజాతివాళ్ళూ ఒకటయ్యే రోజు లొచ్చినయ్! పెత్తందారీ సమాజానికి వీళ్ళు సమాధి కడతారు!" అన్నాడు శ్రీరాములు, భవిష్యత్ వాణిని సూచిస్తున్నట్లు.

శివానంద తల ఎత్తలేదు. అతని అంతరంగంలో అగ్నిగోళాలు మండుతున్నాయ్!! *


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి

పేరు: ____________
విలాసము: ____________
____________ PIN ____________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ —సికిందరాబాద్—